# నీహారిక

బయట సన్నగా వర్షం.

దట్టమైన చలి.

నగరం మొత్తం ఉన్ని రగ్గుల్లో దూరిందా అన్నట్లున్న నల్లని, చిక్కని చీకటి.

కోమల, రాజేశ్వరరావు చీట్లాడుకుంటున్నారు.

ఇంతలో బయట మనిషి కదిలిన అలికిడి.

కోమల ఉలిక్కిపడింది.

'ఎవరు వారు?'

'.......... '

'వహ్ కౌన్ హై'

'... ........"

'హూ ఈజ్ హీ ప్లీజ్?'

'...........'

కోమల భయానికి రాజేశ్వరరావు చకితుడైనాడు.

'సైకాలజీ లెక్చరర్ల మనస్సులు కూడా ఇంత సైకిక్‌గా, సున్నితంగా ఉంటాయా ఏమిటి, కోమలా!"

'మీ జూఆలజీ వాళ్ళలా కప్పలనూ, బొద్దింకలనూ కోసి కోసి మొద్దుబార లేదుగా!" నవ్వింది కోమల.

కాని, ఆ నవ్వు వెనక ఏదో భయం-ఎందుకో ఆందోళన—

నిజమే! మొన్నటి వీరయ్య సంఘటన జరిగిననాటినుండి కోమలకు ప్రతి క్షణమూ భయమే. ప్రతి చోటా వీరయ్య ప్రతిబింబమే!

మరో ఆట మొదలైంది. రాజేశ్వరరావు చీట్లాటలో మంచి నేర్పరి-ముఖ్యంగా రమ్మీలో.

చీట్లాటకు మేధాశక్తి పనికిరాదు. అంతా అదృష్టమే నంటుంది కోమల.

అయితే, రాజేశ్వరరావు అదృష్టవంతుడా?

కాదు. మేధావి ననుకుంటాడు. కానుమాత్రం.

రాజేశ్వరరావు పెద్ద అందగాడు కాడు అయితే, ధనమే సర్వ సౌందర్య సాధనంగానూ, సువర్ణమే సర్వవర్ణాలకన్నా గరిష్ఠమైనదిగానూ భావిస్తే రాజేశ్వర రావు మహా సౌందర్యవంతుడూ, సర్వగుణ సంశోభితుడూను.

ఆ ధనం వల్లనే కోమల ఆకర్షింపబడిందని కూడా రాజేశ్వరరావుకు అంత రాంతరాలలో ఎక్కడో ఉన్నది.

కాని. కోమలకు ధనం మీద మక్కువ ఉందో, లేదో ఇదమిత్థంగా చెప్పడం కష్టం.

స్త్రీకి చీరెలమీద, నగల మీద మోజు ఉండడం సహజమే. కాని, కోమల ఇప్పుడు స్త్రీకాదు.

కేవలం ఒక మనిషి మాత్రమే.

ఆమెకు చీరెలకన్నా, నగలకన్నా, డబ్బుకన్నా ముఖ్యంగా ఒక తోడు కావాలి.

అందుకే రాజేశ్వరరావులో ఆమె లేని అందాలు కూడా చూచుకుంది.

భార్య పోయి ఒంటరిగా ఏ బాదరబందీ లేకుండా జీవిస్తున్న అతనిలో తనకు కావలసిన అన్ని లక్షణాలూ ఉన్నట్లు ఊహించుకుంది.

అందుకే ఈ స్నేహం; అందుకే ఈ తోడు!

చీట్లాట మజాగా సాగుతూంది.

పక్కగదిలో శిరీష చదువుకుంటూంది.

పై వారం నుంచీ ఆమె పరీక్షలు.

అందుకే ఏకాగ్రతతో పొద్దుపోయినా చదువుతూంది.

బయట వర్షం!

ఈదురుగాలికి కదులుతున్న చెట్టుకొమ్మలూ, తీగలూ, కిటికీలనూ గాజు తలుపులనూ రుద్దుతూ రభస చేస్తున్నాయి.

శిరీష కెందుకో కిటికీ దగ్గర మనిషి కదిలినట్లనిపించింది.

అనుమానం వచ్చి చేతిలో పుస్తకం అలాగే టేబిల్ మీద పెట్టి పక్క గదిలోకి తొంగి చూచింది.

రాజేశ్వరరావు కోమల చేతిని ముద్దు పెట్టుకొంటున్నాడు.

చటుక్కున ఆ గదికీ, తన గదికీ మధ్యఉన్న కిటికీని దగ్గరకు వేసి తన గదిలోనుండి బయటకు పోయే వీథి వాకిలి తెరిచి చూచింది.

బయట ఎవరో మానవాకారం చీకట్లో కదులుతున్నట్లనిపించింది శిరీషకు.

'ఎవ రక్కడ?'

జవాబు లేదు

'వ హ కౌన్ హై'

'పర్ దేశీ!" ...మాటలు చాలా బలహీనంగా ఉన్నాయి

'ఇదర్ ఆవో!"

అయిష్టంగానే వచ్చాడు అతడు శిరీషఉన్న గుమ్మం దగ్గరికి. ఆయన తలపాగానూ, గడ్డాన్నీ, చేతికడియాన్నీ బట్టి ఎవరో సర్దార్జీ అని తేలికగానే పోల్చుకున్నది ఇలాంటి సర్దార్జీలూ, కాబూలీవాలాలూ తెల్లవారక ముందే వచ్చి తాము అప్పులిచ్చిన పేదవాళ్ళ ప్రాణాలుపిండడం తనకు బాగా తెలుసు.

ఈయ నెవరు?

మాసిన గుడ్డలనుబట్టి బిచ్చగాడేమోనని అనుకుంది.

వర్షానికి చలికి తమ ఇంటిముందు వరండాలో తలదాచుకుంటున్నాడా?

'లోపలికి రా." హిందీలోనే పిలిచింది.

తడుసుకుంటూ, నెత్తిన పడ్డచూరు నీళ్ళను చేతితో తుడుచుకుంటూ లోపలికి వచ్చాడు సర్దార్జీ.

"ఎక్కడికి పోతున్నావు?"

"విజయవాడకు."

"ఎందుకు?"

"అక్కడ మా కుటుంబం ఉంది."

"మరి హైదరాబాద్ వచ్చావేమిటి?"

"ఇక్కడ వ్యాపార సంబంధంగా పనిఉండి వచ్చాను. ఇంతలో ఈ ముసురు వచ్చి ఇక్కడ చిక్కుపడిపోయాను, అమ్మాయిగారూ."

"చాయ్ తాగుతావా?"

"తమ దయ."

ఫ్లాస్కులోంచి ఓ కప్పు చాయ్ ఇచ్చింది.

ఎంతో ఆప్యాయంగా తాగాడు సర్దార్జీ.

"మీది ఏ దేశం?"

"పంజాబ్."

శిరీషకు మమకారం అంటే ఏమిటో మొదటిసారి తెలిసింది. పొట్టకూటి కోసం పంజాబ్ నుంచి విజయవాడ వచ్చాడు సర్దార్జీ. భార్యాబిడ్డలకోసం ఈ ముసురులో ఈదురుగాలిలో ఇలా అవస్థపడుతూ సంపాదిస్తున్నాడు, పాపం!

"మీ రేం చదువుతున్నారు?" సర్దార్జీ ప్రశ్న.

"రెండేండ్ల ఇంటర్‌మీడియట్".

ఇంతలో తలుపు తోసుకొని ఈ గదిలోకి వచ్చింది కోమల.

కొత్త వ్యక్తిని చూచి ఒక్క క్షణం తెల్లబోయింది.

"ఈయ నెవరే?"

"ఎవరో బాటసారి. వానకు మనఇంటి దగ్గర చిక్కుపడ్డాడమ్మా. పాపం తడిసిపోతున్నాడని లోపలికి పిలిచాను."

"బాగుంది రేపు నువ్వూ, నీ మొగుడూ, ఓ అనాథ శరణాలయాన్ని స్థాపించేటట్లున్నావే?" సర్దార్జీని ఓ క్షణం చూచింది. ఇందాక ఎవరో బయట కదిలినట్లనిపించింది ఇతనేనన్న మాట.

అనవసరంగా ఎంత భయపడిపోయింది తాను!

వీరయ్యేమో ననుకుంది. ప్చ్!!

అల్మారాలోంచి ఓ రెండు ఉలెన్ బ్లాంకెట్స్ తీసుకుంది కోమల.

శిరీష తల వంచుకుని తల్లి ప్రవర్తన గమనిస్తున్నది.

అంటే, రాజేశ్వరరావు ఈ రాత్రికి ఇక్కడే పడుకుంటాడన్న మాట.

'సర్లే. వాణ్ణి బయటకు తరిమి తలుపువేసి పడుకో. దొంగ వెధవలంతా ఇలాగే ఉంటారు.' అని కోమల మధ్య తలుపు బంద్‌చేసి తన గదిలోకి వెళ్ళిపోయింది.

శిరీష ఇటు గడి పెట్టుకుంది.

'ఏమిటి ఆలోచిస్తున్నావు సర్దార్జీ.'

'ఏమీలేదు.' ఈ లోకంలోకి వచ్చాడు సర్దార్జీ.

'నీ పేరేమన్నావు?'

'భగవాన్‌సింగ్.'

'సింగ్‌జీ! నీకెంతమంది పిల్లలు!'

'ఇద్దరు కుమార్తెలు.'

"ఏం చదువుతున్నారు?"

"ఇద్దరూ చిన్నపిల్లలు ఒకామె రెండేండ్లది; మరొకతెకు నాలుగు నెలలు."

"మీకీ తెలుగుదేశం నచ్చిందా?"

"చాలా బాగా నచ్చింది, అమ్మాయిగారూ. మీ ఆచారాలూ, సంప్రదాయాలూ అంటే మాకెంతో ఇష్టం."

"అయితే, మీ పిల్లలు పెద్దయినాక ఏయే గ్రంథాలు చదువుతారు?"

"గ్రంథ సాహెబ్ వంటి మా మత గ్రంథాలూ చదువుతారు మీ సుమతీ శతకం, దాశరథీ శతకం కూడా చదువుతారు - ముఖ్యంగా మా ఆవిడకు మీ సంప్రదాయాలంటే ఎంతో ఇష్టం గోరింటాకు పండగలూ, అట్లతద్దులూ ఎంతో ఇష్టం."

"అట్లతద్ది అంటే ఏమిటి, సర్దార్జీ?"

సర్దార్జీ నవ్వాడు."అమ్మాయిగారూ మీ పండగ గూర్చి మీకే తెలియదా?"

"తెలీదు. నేను చిన్నప్పటినుంచి ఈ హైదరాబాద్‌లోనే పెరిగాను. కాన్వెంట్‌లోనే చదివాను. అందుకని మాకు పండుగలూ పబ్బాలూ అంతబాగా తెలియవు."

సర్దార్జీ అట్లతద్ది అంటే ఏమిటో శిరీషకు వివరించాడు.

'అబ్బ ఎంత బాగుందీ పండగ!' అన్నది శిరీష.

"మరి - జీవితమంటే ఈ బస్సులూ, కార్లూ మాత్రమే కాదు అమ్మాయిగారూ. పండుగలూ పబ్బాలూ, ఆచారాలూ వ్యవహారాలూ - అదే జీవితమంటే- అవే బ్రతుకు పై మమతను పెంచుతాయి - మాధుర్యాన్ని పంచుతాయి."

సర్దార్జీకి మంచి సంస్కారం ఉందని గ్రహించింది శిరీష.

ఇంతలో తల్లి మళ్ళీ తలుపుకొట్టింది.

శిరీష తలుపు తీసింది.

"తల నొప్పిగాఉంది. ఆ ఫ్లాస్కు ఇటు తే."

ఈసారి కోమలను పరీక్షగా చూచాడు సర్దార్జీ.

"అరే. వాణ్ణెవణ్ణో తరమలేదా ఏమిటి ఇంకా!"

'వెడతాడులేమ్మా. బయట మరీ ముసురుగా ఉంది కదా!'

'బాగుంది వరస' మారువేషంలో వీరయ్య వచ్చాడేమోనని మరొక్షణం పరీక్షించి చూచింది కోమల.

కోమల ఏదో ఆవేశంలో తనకెంతమాత్రమూ అర్హతలోకాని, అంతస్తులో కాని సమానం కాని వీరయ్యతో ఓ తప్పుచేసింది. వీరయ్య అప్పటినుంచి శనిగ్రహంలా పట్టుకున్నాడు.

తరవాత పశ్చాత్తాపపడింది.

వీరయ్య మొహాన కాస్త డబ్బు పడేసి పొమ్మంది. అయినా, వదలడం లేదు వాడు.

కోమల నిట్టూర్చి ప్లాస్కు తీసుకొని వెళ్ళిపోయింది.

అవతల తలుపు గడియవేసుకున్న శబ్దం.

'ఏమిటి, సర్దార్జీ, ఆలోచిస్తున్నావు?'

సర్దార్జీ మాట్లాడలేదు.

'ఆఁ ఇంకా చెప్పు. మీ కూతురు చేతులకు గోరింటాకు పెట్టుకొని చిన్న ఉయ్యాల ఊగుతుందా? అయితే, సర్దార్జీ, పెద్ద పెద్ద ఊపులతో ఉయ్యాలలూగితే పిల్లలు కింద పడిపోరా?'

సర్దార్జీ మాట్లాడదంలేదు.

అతని కళ్లు చెమ్మగిల్లాయి.

"నీ పేరు ఏమన్నారు, అమ్మయిగారూ."

"శిరీష "

"శిరీషగారూ, మీరు చిన్నప్పుడు ఎప్పుడూ ఉయ్యాల ఊగనేలేదా?"

'లేకేం? ఇదుగో - ఉయ్యాల ఊగుతూ ఫోటో కూడా తీయించుకున్నాను అయితే, అది నీవు చెప్పే అట్లతద్ది ఉయ్యాల కాదు కేవలం విలాసార్థం కట్టుకున్న ఉయ్యాల. ఇదుగో - చూడు.'

ఆల్బమ్ నుండి తన చిన్నప్పటి ఫోటో చూపింది.

భగవాన్‌సింగ్ ఫోటోచూచి, 'చాలాబాగుంది అమ్మాయిగారూ! మీ చిన్నప్పటి ఫోటో - అరే! ఈ ఫోటో ఎవరిది?'

"మా నాన్నగారిది - వెంకటసుబ్బయ్యగారు. నా చిన్నతనంలో చనిపోయారు. అవునుగానీ, సర్దార్జీ, భర్త చనిపోతే మీ ప్రాంతంలో స్త్రీలు మళ్ళీ పెళ్ళిచేసుకోవడం, స్కూటర్లు ఎక్కి తిరగడం చేస్తారా?"

"ఏమమ్మా అలా అడిగావు?"

"ఇవన్నీ నా కిష్టంలేదు సర్దార్జీ! అయినా మా అమ్మ అలా చేస్తుంది. రాజేశ్వరరావు అనే లెక్చరర్‌ని చేసుకుంటుంది! వాడంటే నా కసహ్యం. అచ్చంగా బొద్దింకలాగే ఉంటాడు.

ఆల్బమ్ టేబిల్ మీద పడేశాడు భగవాన్‌సింగ్.

"సర్దార్జీ, ఇంక పడుకుందాం. నీ కభ్యంతరం లేకపోతే ఆ సోఫా-కమ్-బెడ్‌లో పడుకో - తెల్లవారాక వెళ్ళవచ్చు."

"అలాగే అమ్మాయిగారూ."

శిరీష ముఖానికి కోల్డ్ క్రీమ్ పూసుకొని వచ్చింది.

సర్దార్జీ తన సంచిలోంచి ఓ పర్స్ తీసి శిరీష చేతికిచ్చి, "అమ్మాయిగారూ, ఇక్కడ దొంగభయం లేదుగదా" అన్నాడు.

"లేదులే - ఏం?"

"ఎందుకైనా మంచిది- దీన్ని లోపల భద్రంగా దాచండి. ఉదయం తీసుకుంటాను."

"అలాగే." పర్స్ తీసుకొని అల్మైరాలో పెట్టి లాక్ చేసింది.

సర్దార్జీ పడుకుంటూ అన్నాడు: "అమ్మాయిగారూ, మీరు చదువంతా పూర్తయ్యాక మంచి తెలుగు పిల్లవాణ్ణి పెళ్ళిచేసుకోండి."

"లేదు, భగవాన్‌సింగ్. మా అమ్మగారికి పీటర్ పాల్ స్నేహితుడు. ఆయన కొడుకు అమెరికాలో చదువుతున్నాడు. బహుశా ఆ శామ్యూల్‌కే నన్నిచ్చి చేయాలని మా అమ్మ ఉద్దేశం.'

'మరి నీ ఇష్టం?'

'నా దేముంది?' అని కొంచెం ఆగి అన్నది.

'శామ్యూల్ చాలా అందంగానే ఉంటాడు....

శిరీష భగవాన్‌సింగ్‌ను వరండా పక్కగదిలోకి పంపి తలుపులు వేసుకొని పడుకొంది.

ఉయ్యాల ఊగుతున్నట్లూ, చేతులకు గోరింటాకు పెట్టుకున్నట్లూ, అట్లతద్ది పాటలు పాడుతున్నట్లూ ఊహించుకుంటూ పడుకుంది శిరీష. అవే అలలు అలలుగా కలలు కలలుగా ఆమె మనస్సులో మెదులుతూ ఉన్నాయి తెల్లవార్లూ.

ఉదయం నిద్ర లేచి చూచింది.

బయట వర్షం లేదు. కాని, గాలి మాత్రం ఈదురుమంటూనే ఉంది.

'సర్దార్జీ!' తలుపు తీసింది.

గదిలో సర్దార్జీ లేదు.

శిరీష నివ్వెరపోయింది. ఆ గదిలోంచి వీధివైపు ఉన్న ద్వారం తెరిచి ఉంది.

సర్దార్జీ రాత్రికి రాత్రే చెప్పకుండా పారిపోయాడా? ఎందుకు?

భగవాన్‌సింగ్ ఎవడో దొంగ అని నిశ్చయించుకుంది శిరీష.

ఈ సంగతి తల్లికి చెబితే తన్ను కొడుతుంది. అడ్డమైన వెధవలనూ గదిలోకి రానిచ్చిన నేరం తనదికాదా... పోలీసులకు ఫోన్ చేస్తే? ఏమని???

ఉదయం కరకరమని పొద్దు పొడిచేసరికి పోలీసులు వచ్చి తలుపు తట్టారు.

శిరీష నివ్వెరపోయింది.

తాను ఫోన్ చేయకుండానే వచ్చారేమిటి?

'మిసెస్ కోమలగారి ఇల్లు ఇదేనా?'

శిరీష వారిని డ్రాయింగ్ రూమ్‌లోకి ఆహ్వానించి,

'అవును. రండి, సార్' అనిపిలిచింది.

'దయచేసి ఒక్కసారి మీ అమ్మగారిని పిలుస్తావా, అమ్మాయ్. ఆమె మీ అమ్మగారేనా? ...'

'అవును అవును. పిలుస్తాను' అంటూ వెళ్ళి తలుపు తట్టింది.

కోమల తన గదిలో కూర్చుని చాయ్ తాగుతూ ఏదో బ్యూటీ మాగజైన్ పేజీలు తిప్పుతూ ఉంది.

'అమ్మా, పోలీసులు వచ్చారు ఎందుకో.?'

కోమల ఆశ్చర్యంతోనూ, భయంతోనూ డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చింది.

'సారీ, మేడమ్. మీకీ విషయం తెలుసా?'

'ఏమిటి?'

"వెంకటసుబ్బయ్యగారు సజీవుడేనన్న విషయం?"

కోమల నెత్తిన పిడుగులు పడ్డట్లనిపించింది.

"వ్హాట్? ఏమిటి మీరంటున్నది?"

"అవును, వెంకటసుబ్బయ్యగారు సజీవులే. మీరేకదా వారి భార్య?"

"అ వు....ను...."

"ఇంతకుపూర్వం మీరు విజయవాడలో ఉండేవారు కదూ."

"అవును."

"మీకిద్దరు పిల్లలా?"

"అవును. కాని, ఒకామె ఏడాది నిండకముందే పోయింది."

శిరీష నివ్వెరపోయింది తనకో చెల్లెలు ఉండేదని విని.

"సారీ, మేడమ్. వెంకటసుబ్బయ్యగారు చనిపోలేదు రంగూన్‌లో పడవ ప్రమాదంలో మతిచలించి హాస్పిటల్‌లో ఉన్నారు. ముఖమంతా కాలిపోయి కురూపి కావడంతో పోల్చే వీలుకూడా లేకపోయింది ఆయన చనిపోయినాడని వచ్చిన వార్త అబద్ధం."

"అయితే."

"అవును. ఇప్పుడాయన విజయవాడ వచ్చారు. మీరు హైదరాబాద్ వచ్చారని అడ్రసు తెలుసుకొని నిన్న మీ ఇంటికి వచ్చారట!"

కోమల వణికిపోతున్నది.

భర్త సజీవుడేనన్న సత్యంతో ఆమె సమాధానపడలేకపోతున్నది.

"అయితే, ఆయన ఏడీ?"

"రండి చూపుతాము." శిరీష హుషారుగానూ, కోమల వణుకుతూనూ పోలీసు వాన్ ఎక్కారు. వాన్ హాస్పిటల్ వద్ద ఆగింది.

పోస్టుమార్టమ్‌కోసం బల్లమీద పెట్టిన శవాన్ని చూచి భగవాన్‌సింగ్‌ను గుర్తుపట్టింది శిరీష.

"అరే ఈయన భగవాన్‌సింగ్."

"నీకీయన తెలుసునా, అమ్మాయ్?"

"ఆఁ తెలుసు. రాత్రి మా ఇంటికి వచ్చాడు."

"అరె, అయితే ఆ వివరాలన్నీ తరవాత చెప్పు. వ్రాసుకోవాలి."

"ఏమైంది ఈయనకు?" శిరీష దుఃఖంతో ప్రశ్నించింది.

"ఆత్మహత్య చేసుకున్నారు."

"ఎందుకు?"

"తెలియదు. తన ఊహకూ, వాస్తవానికీ పొత్తు కుదరనందున నిజంగానే మళ్ళీ గతంలో కలిసిపోయేందుకై చనిపోతున్నానని వ్రాశారు.

తన భార్య పేరు కోమల అనీ, ఆమె తెల్లవారుజామునే లేచి బాలగోపాల పదాలు పాడుతూ చల్ల చిలుకుతూ ఉంటుందని, తన చిన్న కూతురు రెండేండ్లది గోరింటాకు పెట్టుకొని అట్లతద్ది పండగలో ఉయ్యాల ఊగేదని నోట్లో వేలు వేసుకొని చూస్తూ ఉంటుందని, మరోపిల్ల తప్పకుండా సావిత్రిలా, దమయంతిలా అవుతుందని అందులో వ్రాసుకున్నారు. ఆయన జేబులో మీ ఇంటి అడ్రసు వ్రాసుకున్న కాగితాలూ, ఈ ఉత్తరమూ వేరువేరుగా దొరికాయి."

కోమల గట్టిగా నిట్టూర్చింది.

ముఖాన్ని పరీక్షించి పోల్చుకోవడానికి ప్రయత్నించింది.

నుదురు, చెక్కిళ్ళు మంటలకు కాలిన ముడతలతో వికృతంగా ఉన్నాయి.

చనిపోయిన వ్యక్తి తిరిగి సజీవుడైనాడన్న నిజం ఎంత భయంకరంగా తోచిందో తిరిగి ఆయన గతంలోనే కలిసిపోయాడనే వాస్తవం ఆమెకంత రిలీఫ్ ఇచ్చింది.

వాస్తవికతతో ఆమె మనస్సు సమాధానపడింది తృప్తిగా!

భగవాన్‌సింగ్ శవానికి దహన సంస్కారాలు జరిగాయి

బయట ఎర్రని ఎండ. పొగమంచు పూర్తిగా చెదిరిపోయింది. తల్లీబిడ్డలు ఇల్లుచేరారు. శిరీషకు ఇంటికి వచ్చాక అకస్మాత్తుగా గత రాత్రి సర్దార్జీ ఇచ్చిన పర్సు గుర్తుకువచ్చింది. గబగబా అల్మైరా తలుపులు తీసి చూసింది.

పర్సు అక్కడే ఉంది.

లోపల కొంత కరెన్సీతోబాటు రెండు ఉంగరాలు ఉన్నాయి.

వాటి రాళ్ళు వేల రూపాయల ఖరీదైనవి.

ఒకటి రెండేండ్ల పాపకూ, మరొకటి నాలుగునెలల పాపకూ పట్టే సైజులో చేయించుకొని తెచ్చాడు సిర్దార్జీ.